సాక్షి
కాకినాడ
మంగళవారం । 14 । నవంబర్ । 2023



నారసింహ సుదర్శన హోమానికి రూ.లక్ష విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యం నిర్వహించే నారసింహ సుదర్శన హోమానికి గారపాటి రవితేజ్, సోనిక దంపతులు (అమలాపురం) శాశ్వత విరాళంగా రూ.1,00,000 అందజేశారు.



పండగ వెలుగు పంచి.. ఆరిపోయిన దీపాలు

హైదరాబాద్‌లో పెయింటింగ్ పనులు చేస్తూ బతికే ఆ యువకులు దీపావళికి సొంత ఊరి వచ్చి రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. ఆ కుటుంబాల్లో చీకట్లు మిగిల్చారు. 8లో

7 వేల క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు సోమవారం 7 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,600, మధ్య డెల్టాకు 1,400, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీవద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన అవసరం

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



వేలంక వారధి కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

కిర్లంపూడి: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ సూచించారు. మండలంలోని వేలంక, గోనేడ గ్రామాల్లో సోమవారం స్థానిక సీఐ బి.సూర్యఅప్పారావు అధ్యక్షతన వారధి కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ సతీష్‌కుమార్, పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో సమస్యాత్మక గ్రామాలను సందర్శించి గ్రామ పెద్దలతో చర్చిస్తున్నట్టు చెప్పారు. లా అండ్ ఆర్డర్‌పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో వచ్చే చిన్నచిన్న తగాదాలను గ్రామ పెద్దల సమక్షంలోనే పరిష్కరించుకోవాలన్నారు. వచ్చే ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కిర్లంపూడి ఎస్సై పి.ఉమామహేశ్వరావు, స్థానిక నాయకులు అల్లు విజయ్ కుమార్, దోమాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విద్యాదీవెనకు ఉమ్మడి ఖాతాలు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): జగనన్న విద్యాదీవెన పథకానికి విద్యార్థితోపాటు తల్లికీ ఉమ్మడిగా బ్యాంకు ఖాతా ఉండాలని సోషల్‌వేల్ఫేర్‌శాఖ జేడీ డివి రమణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకూ విద్యాదీవెన లబ్ధిని తల్లుల ఖాతాల్లోనే జమచేసేవారు. ఇకపై ఉమ్మడి ఖాతాకు జమచేయనున్నట్లు పేర్కొన్నారు. జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన లబ్ధిదారులైన విద్యార్థులు తల్లితో కలిసి ఉమ్మడిఖాతా తెరవాలన్నారు. ఈ ఖాతాలో విద్యార్థి ప్రాథమిక ఖాతాదారుగాను, తల్లి ద్వితీయ ఖాతాదారునిగా ఉండాలన్నారు. ఎస్సీ విద్యార్థులు, చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఉమ్మడి ఖాతాలు అవసరం లేదన్నారు. ఉమ్మడిఖాతా తెరిచిన తర్వాత ఆ వివరాలను నాలుగో విడత జగనన్న విద్యాదీవెన పథకం నగదు విడుదల కోసం సచివాయాల్లో ఉమ్మడిఖాతా బ్యాంకు జెరాక్స్ కాపీ అందజేయాలన్నారు. ఈ నెల 24లోపు కొత్తఖాతాలు తెరుచుకోవాలన్నారు.

ముగిసిన 'సౌత్ జోన్' కబడ్డీ పోటీలు



విన్నర్ టీమ్‌ను అభినందిస్తున్న ఆదిత్య వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, అతిథులు

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య విద్యాసంస్థల ప్రాగణంలో నాలుగు రోజుల పాటు జరిగిన సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పురుషుల కబడ్డీ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లోని 113 యూనివర్సిటీలకు చెందిన 1200 మంది క్రీడాకారులు పాల్గొన్నట్టు ఆదిత్య కళాశాలల వైస్ చైర్మన్ ఎస్.సతీష్‌రెడ్డి తెలిపారు. విజేతలకు ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి, వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, కాకినాడ జేఎన్‌టీయూకే వైస్ చాన్సలర్ జీవీఆర్ ప్రసాద్‌రాజు, జింబాబ్వే దేశానికు చెందిన ఎడ్యుకేషనల్ కౌన్సిలర్ లమ్‌మోర్ ట్రోఫీ, మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరెడ్డి, జీపీ రాజు, శ్యామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి డ్వామా అధికారులకు శిక్షణ

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో 11 జిల్లాలకు చెందిన డ్వామా అధికారులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం నుంచి ప్రారంభమవుతుందని ఈటీసీ మేనేజర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం, కాకినాడ, తూర్పు, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలోని డ్వామా పీడీ, ఏపీడీలకు శిక్షణ ఉంటుందని చెప్పారు.

● గోదావరి డెల్టాలో

రబీకి గ్రీన్ సిగ్నల్

- నీటి కొరత అధిగమించేందుకు ప్రత్యామ్నాయ పద్ధతులపై ఫోకస్
- గతేడాది తరహాలోనే సరఫరాకు చాన్స్
- నేటి నుంచి ఐఏబీ సమావేశాలు

రబీ సమయంలో నీటి వినియోగం ఇలా

నెల	రోజులు	రోజుకు ఇచ్చే నీరు (క్యూసెక్కులలో)	నెలకు అవసరమైన నీరు (టీఎంసీలలో)
డిసెంబర్	31	6,000	16.07
జనవరి	31	8,000	21.42
ఫిబ్రవరి	29	9,000	22.55
మార్చి	31	9,000	24.09
తాగునీరు	122		7.22
మొత్తం			91.35

చర్చించాక తుది నిర్ణయం

గోదావరి డెల్టా రబీ ఆయకట్టుపై మంగళవారం నుంచి జిల్లాల వారీగా సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశాలు జగనున్నాయి. నీటి లభ్యత, కొరత, ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా నీటి సేకరణపై చర్చించనున్నాం. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు నిర్ణయించిన తరువాత రబీ ఆయకట్టుపై స్పష్టత వస్తోంది.

– శ్రీనివాసరావు, ఎస్ఈ, ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్.

సాక్షి అమలాపురం: గోదావరి డెల్టాలో రబీ ఆయకట్టుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. వర్షాభావ పరిస్థితులు.. ఈ ఏడాది గోదావరిలో ఇన్ ఫ్లో తక్కువగా నమోదు కావడంతో రబీ సాగుకు నీటి లభ్యతపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. సాగుకు అవసరమైన నీటి లభ్యతలో 8.86 టీఎంసీల కొరత ఉన్నప్పటికీ దానిని అధిగమించేందుకు అధికారులు ప్రత్యామ్నాయ పద్ధతులకు సిద్ధమవుతూ ఆయకట్టు మొత్తానికి నీరు ఇవ్వనున్నారు.

అత్యధిక సాగు విస్తీర్ణం

రాష్ట్రంలోనే రబీ ఆయకట్టులో కీలకమైనది గోదావరి డెల్టా. కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల పరిధిలో డెల్టా విస్తరించి ఉంది. అధికార గణాంకాల ప్రకారం మొత్తం ఆయకట్టు 10.36 లక్షల ఎకరాలు. దీనిలో తూర్పు డెల్టా 2,64,507 ఎకరాలు, మధ్యడెల్టా 1,72,000, పశ్చిమ డెల్టా 4,60,000 ఎకరాల చొప్పున మొత్తం



తూర్పు డెల్టా ప్రధాన పంట కాలువ

వరి ఆయకట్టు 8,96,507 ఎకరాలు. కానీ వాస్తవ సాగు 7.50 లక్షల ఎకరాలు ఉంటోంది. మిగిలిన ఆయకట్టులో ఆక్వా చెరువులు, రియల్ ఎస్టేట్ భూములు మెరక చేసి ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు.



డెల్టాలో వరిచేలు

అవసరం ఎంతంటే..

ఈ ఏడాది గోదావరిలో ఇన్ ఫ్లో తక్కువగా ఉంది. దీంతో రబీ సాగుపై ఇది ప్రభావం చూపిస్తోందని రైతులు ఆందోళన చెందారు. కాని సహజ జలాల రాక, పోలవరం ప్రాజెక్టు వద్ద నిల్వ ఉన్న నీటిని పరిగణలోకి తీసుకుంటే కొరత చాలా తక్కువగా ఉండనుంది. మొత్తం ఆయకట్టు పరిధిలో సాగు, తాగునీటికి 91.35 టీఎంసీలు అవసరం. డెల్టాలో రబీ షెడ్యూలు డిసెంబర్ 15న మొదలై మరుసటి ఏడాది ఏప్రిల్ 15 వరకు ఉంటోంది. కాని సాగునీటి పారుదల శాఖ అధికారులు డిసెంబర్ 1 నుంచి మార్చి 31 వరకు రబీ షెడ్యూలుగా నిర్ణయించారు. ఈ కాలంలో పంటతో పాటు తాగునీటికి కలిపి 91.35 టీఎంసీల నీరు అవసరంగా గుర్తించారు.

రబీలో దిగుబడి జోరు

డెల్టాలో వరి సగటు దిగుబడి ఖరీఫ్‌లో 28 బస్తాలు (బస్తా 75 కేజీలు) కాగా, రబీలో 45 బస్తాలు. డెల్టాలో ఖరీఫ్ కన్నా రబీ దిగుబడి అధికం. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఏకంగా 34 నుంచి 48 బస్తాల వరకు దిగుబడిగా వస్తోంది. రబీలో సైతం 45 బస్తాల సగటు దిగుబడి అయినప్పటికీ అంతకన్నా అధికంగా వచ్చిన సందర్భాలు ఉన్నాయి. 45 బస్తాలు అనుకున్న డెల్టాలో 25.31 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడిగా రానుంది. ఈ కారణంగా రైతులు రబీ సాగుపై అధికంగా ఆశలు పెట్టుకుంటారు.

కొరత అధిగమించేందుకు

డెల్టా అవసరాలకు సరిపడే నీటికి కొంత కొరత ఏర్పడనుంది. అధికారులు నిర్ణయించిన షెడ్యూలు సమయంలో సీలేరు నుంచి వాటాగా వచ్చే నీటి లభ్యత 40.49 టీఎంసీలు. పోలవరం ప్రాజెక్టు నుంచి 12 టీఎంసీలు, సహజ జలాలు (ఫిబ్రవరి నెలాఖరు వరకు అంచనా) 30 టీఎంసీలు వస్తుంది.

మొత్తం నీటి లభ్యత 82.49 టీఎంసీలు కాగా, కొరత 8.86 టీఎంసీలు. అందుకే అధికారులు ప్రత్యామ్నాయ పద్ధతుల్లో నీటిని సేకరించాలని నిర్ణయించనున్నారు. పంట కాలువలపై వంతుల వారీ విధానంతో నీటిసరఫరా చేస్తే 5 టీఎంసీల నీటిని, మురుగునీటి కాలువలపై క్రాస్‌బండ్‌లు వేయడం, మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోయడం ద్వారా 3.86 టీఎంసీలు సేకరించాలని నిర్ణయించారు. తద్వారా మొత్తం ఆయకట్టుకు సాగు నీరందించనున్నారు. గత ఏడాది కూడా ఇలాగే చేశారు. ఈ నేపథ్యంలో డెల్టా పరిధిలో మంగళవారం నుంచి జిల్లాల వారీగా సాగునీటి పారుదల సలహా మండలి సమావేశం జరుగుతుంది. ఇందులో మొత్తం ఆయకట్టుకు నీరందించడంపై నిర్ణయం తీసుకోవడం లాంఛనమే కానుంది. ప్రభుత్వం తమకు అనుకూల నిర్ణయం తీసుకుంటారని తెలిసిన డెల్టా ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సైన్స్ కాంగ్రెస్‌లో కరప విద్యార్థినుల ప్రతిభ

జిల్లాస్థాయి ఉత్తమ ప్రాజెక్టుగా ఎంపిక

కరప: బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలలో కరప హైస్కూలు విద్యార్థినులు భళా అనిపించుకున్నారు. వారు ప్రదర్శించిన ప్రాజెక్టు ఉత్తమంగా ఎంపికైంది. రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు వీరు రూపొందించిన 'మానసిక పిల్లలు పుట్టుక కారణాలు, పరిష్కారం' అనే ప్రాజెక్టు ఎంపికైంది. ఈనెల 9, 10 తేదీలలో కాకినాడలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 260 ప్రాజెక్టులు ప్రదర్శించగా రాష్ట్రస్థాయికి ఏడు ఎంపికయ్యాయి. అందులో కరప విద్యార్థినులు రూపొందించిన ప్రాజెక్టు ఒకటి. గుంటూరులోని కేఎల్ యూనివర్సిటీలో ఈనెల 29, 30వ తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఈ ప్రాజెక్టు ఎంపికైనట్టు గైడ్‌టీచర్ మడికి సుదర్శనబాబు, హెచ్‌ఎం యు.లీలామనోహర్‌లు సోమవారం తెలిపారు.

ప్రాజెక్టు రూపొందించిన విధానం

కరప జెడ్పీ ఉన్నతపాఠశాలలోని భవిత కేంద్రంలో ప్రత్యేక ప్రతిభావంతులైన పిల్లలకు ఫిజియోథెరపీ చేయిస్తూ, ఆటపాటలతో విద్యాబుద్ధులు నేర్పుతున్నారు. వీరిని విద్యార్థినులు రమ్యశ్రీ సత్యరత్నామణి, యశస్వి విజయదుర్గలు గమనించారు. వీరి గురించి సైన్స్ ఉపాధ్యాయుడు సుదర్శనబాబును ఆరా తీశారు. ఈ కోణంలో భవిత కేంద్రం నిర్వాహకులను, పీహెచ్‌సీ



ఉత్తమప్రాజెక్టు ప్రశంసా పత్రాన్ని తీసుకుంటున్న కరప హైస్కూలు విద్యార్థినులు. చిత్రంలో గైడ్‌టీచర్


వైద్యులను సంప్రదించి మంచి ప్రాజెక్టు తయారు చేస్తే, బాగుంటుందని ఆయన సూచించారు. దీంతో ఆ విద్యార్థినులు కరప పీహెచ్‌సీ డాక్టర్ పి.ఆశ, భవితకేంద్రం ఫిజియోథెరపిస్ట్ మారుతి, స్పీచ్ థెరపిస్ట్ స్వాతి, టీచర్ మల్లేశ్వరులను కలిశారు. వారు తెలిపిన వివరాలు ఆధారంగా ప్రాజెక్టును రూపొందించారు. ఉపాధ్యాయుడు సుదర్శనబాబు మార్గదర్శిగా నిలిచారు. వీరు రూపొందించిన ప్రాజెక్టును జిల్లా సైన్స్ అధ్యక్షుడు వినీల్, కన్వీనర్ కేసరి శ్రీనివాస్ ఉత్తమప్రాజెక్టుగా ఎంపికచేశారు. విద్యార్థినులను, గైడ్‌ను జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైఎస్‌ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఎంఈఓలు కె.బులికృష్ణవేణి, పి.సత్యనారాయణ, హెచ్‌ఎం యు.లీలామనోహర్ తదితరులు అభినందించారు.

ఆధ్యాత్మికతకు నెలవు

- నేటి నుంచి కార్తికమాసం

అన్నవరం / పిఠాపురం / సామర్లకోట : ఆధ్యాత్మిక మాసం... కార్తికం మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. నెలరోజుల పాటు దేవాలయాల వద్ద ఆధ్యాత్మికత పరవళ్లు తొక్కనుంది. అభిషేకాలు.. ప్రత్యేక పూజలు... ఆకాశదీపాలతోపాటు ఆలయాల వద్ద ప్రత్యేకంగా దీపాలను వెలిగించడం వంటి ఎన్నో దైవ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మరోవైపు పర్యాటక సందడి కూడా ప్రారంభమవుతోంది. సముద్ర తీరంలోని బీచ్‌లు.. పర్యాటక ప్రాంతాలను సందర్శించేవారు... గార్డెన్ పార్టీల నిర్వహణతోపాటు ఆయా సంఘాలు, కుల సంఘాల ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధనలు జరగనున్నాయి.

శివకేశవులకు ప్రీతికరం : కార్తిక మాసం శివకేశవులకు ప్రీతికరమైనది. కార్తిక పురాణంలో కార్తిక సోమవారం, జ్వాలాతోరణం మహాశివుడి ప్రాముఖ్యతను తెలియజేస్తే బలి పాడ్యమి, ఏకాదశి, క్షీరాబ్ది ద్వాదశి శ్రీ మహావిష్ణువు ప్రాముఖ్యతను వివరిస్తాయి. కార్తిక పురాణంలో కూడా మొదటి 15 అధ్యాయాలు ఈశ్వరుడి ప్రాముఖ్యతను, ఆఖరి 15 అధ్యాయాలు శ్రీహరి ప్రాధాన్యాన్ని తెలియజేస్తాయి. ఈ ఏడాది నవంబర్ 14 మంగళవారం కార్తికమాసం ప్రారంభమవుతోంది. డిసెంబరు 13న బుధవారం పోలిస్వర్గంతో కార్తికం పూర్తవుతుంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో వేలాది మంది భక్తులు అయ్యప్పస్వామిమాలలు



పాదగయ క్షేత్రం

ధరించిన విషయం తెలిసిందే. వీరితోపాటు మహాశివుని మాలలు సైతం ధరిస్తున్నారు.

అన్నవరంలో ప్రత్యేక ఏర్పాట్లు

కాకినాడ జిల్లాలోని అన్నవరం సత్యదేవునికి సైతం కార్తికమాసంలో భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. సోమవారాలలో 50 వేల నుంచి 70 వేల మంది భక్తులు దర్శనానికి వస్తారు. పౌర్ణమి రోజున లక్ష మంది వరకు వస్తారని అంచనా. అందుకు తగినట్టుగా క్యూలు పెంచడంతోపాటు ప్రసాదాల విక్రయాలు, ఇతర సౌకర్యాలపై అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పిఠాపురం శ్రీ కుక్కుటేశ్వరస్వామి ఆలయానికి భక్తుల తాకిడి అధికం. అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటైన శ్రీ పురుహూతిక అమ్మవారి పీఠం ఇక్కడ ఉంది. ఈ ఆలయానికి భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. దీంతోపాటు సమీపంలోని సామర్లకోట శ్రీ బాలాత్రిపుర సుందరి సమేత కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయానికి కూడా కార్తికమాసంలో



సామర్లకోట భీమేశ్వరాలయం



అన్నవరం శ్రీ సత్యదేవుని ఆలయం

భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. సోమవారాలు రోజుకు 40 వేల నుంచి 50 వేల మంది వరకు భక్తులు వస్తుంటారు. 29వ తేదీన ఇక్కడ స్వామివారికి నిర్వహించే తెప్పోత్సవానికి పెద్ద ఎత్తున భక్తులు రానున్నారు.

సహకారం.. మంచి తరుణం

- లాభాల బాటలో సహకార సంఘాలు
- రైతులకు బాసటగా నిలుస్తూ సేవలు
- ఏడాదికి రూ.11 కోట్లకు పైగా ఆదాయం
- నేటి నుంచి సహకార వారోత్సవాలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): వ్యవ'సాయానికి' వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా ఉంటోంది.. దేశానికి అన్నం పెట్టే రైతన్నకు 'సహకారం' అందిస్తోంది.. గత టీడీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించింది.. పుడమి పుత్రులు సాగుకు దూరం అయ్యేలా చేసింది.. గత కష్టాలను చెరిపేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతన్నల శ్రేయస్సే లక్ష్యంగా సాగుతోంది.. రైతులకు ఏ రుణం కావాలన్నా సహకార సంఘాల ద్వారా అందిస్తూ ఆపద సమయంలో ఆపద్బాంధవిగా మారింది. ప్రజాసంకల్ప యాత్ర సమయంలో రైతుల కష్టాలను స్వయంగా చూసిన అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి సంక్షేమ కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టడంతో పాటు సహకార సంఘాలను మరింత బలోపేతం చేశారు. రైతులకు కావాల్సిన బంగారు రుణాలు, కేవలం 7 శాతం వడ్డీకే పంట రుణాలు, రైతుల పిల్లలకు విద్యా రుణాలు సైతం సహకార సంఘాల ద్వారానే అందిస్తున్నారు.



సామర్లకోట మండలం నవర ప్రాథమిక సహకార సంఘం

ఒకప్పుడు రుణం కావాలంటే అనేక ఇబ్బందులు పడే రైతులు నేడు సహకార సంఘాల ద్వారా అన్ని రుణాలు సులువుగా పొందుతున్నారు. ప్రస్తుతం ప్రైవేట్ బ్యాంకులకు ధీటుగా సహకార బ్యాంకులను తీర్చిదిద్దారు.


వ్యవస్థకు పునాది ఇది..

కొంతమంది వ్యక్తులు కలసి తమ అందరి బాగోగుల కోసం పనిచేయడాన్ని సహకారం (కో ఆపరేషన్) అంటారు. ఒకరు చేయలేని పనిని కొంత మంది కలసి సాధించవచ్చు. ఇలా అంతా కలసి ఉమ్మడి లక్ష్యం కోసం ఉద్యమించడమే సహకారోద్యమం. ఇలా ఏర్పడిన సంఘాలను సహకార సంఘాలు అంటారు. ఇందులో భాగస్వాములైన వ్యక్తులకు కొన్ని నిర్దిష్టమైన ఆశయాలు ఉంటాయి. సభ్యులందరికీ సమాన హక్కులు కల్పించబడతాయి. అందరూ కలసి కార్యక్రమాలు నిర్వహిస్తారు. సహకార సంఘాలు మొదట్లో జర్మనీ దేశంలో స్థాపించారు. తర్వాత ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాల్లో సహకారోద్యమం ప్రారంభమైంది. భారతదేశంలో 1904లో నుంచి ఆరంభించారు. వీటికి సహాయం చేయడానికి ప్రభుత్వంలో సహకార మంత్రిత్వ శాఖలు ఏర్పాటయ్యాయి. రాష్ట్ర, జిల్లా స్థాయిలో వీటిని ఏర్పాటు చేశారు.

వారోత్సవాల్లో కార్యక్రమాలివి..

సహకార వారోత్సవాలను జిల్లాలో ఈ నెల 14 నుంచి 20 వరకూ ఘనంగా నిర్వహించేందుకు ఆ శాఖ అన్ని చర్యలు తీసుకుంటుంది. వారం రోజుల పాటు జరిగే కార్యక్రమాల షెడ్యూల్‌ను విడుదల చేసింది. 14న సహకార సంఘాల్లో ఇటీవల పరిణామాలు, 15న పరపతేతర సంఘాలు, ఆర్థిక వేదిక పురుజ్జీవం, 16న సహకార సంఘాల డిజిటలైజేషన్ కోసం సాంకేతికతను స్వీకరించడం, 17న అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో సహకార సంఘాల ద్వారా వ్యాపారం సరళతరం, 18న పబ్లిక్- ప్రైవేట్ రంగాల్లో సహకార భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం, 19న మహిళలు, యువత, బలహీన వర్గాల కోసం సహకార సంఘాలు, 20న సహకార విద్య, శిక్షణ పునర్నిర్మించాలని సంఘాల సీఈఓలకు సహకార శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

లాభాల బాట పట్టేందుకు..



సహకార సంఘాలు లాభాల బాట పట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. రైతులకు రుణాలు ఇవ్వడమే కాకుండా సహకార సంఘాల ద్వారా మెడికల్ షాపులు, పెట్రోల్ బంకులు వంటివి ఏర్పాటు చేసే విధంగా ఆయా సంఘాలను ప్రోత్సహిస్తున్నాం. ప్రభుత్వం సహకార సంఘాల ద్వారా స్థానికంగా గొడౌన్లు నిర్మించేందుకు అన్నివిధాలా ప్రోత్సాహం అందిస్తుంది.

–బీకే దుర్గాప్రసాద్, జిల్లా సహకార శాఖాధికారి

జిల్లాలో 1.12 లక్షల మందికి లబ్ధి

కాకినాడ జిల్లాలో 72 సహకార సంఘాలు ఉన్నాయి. ప్రతి ఏడాది ఆయా సంఘాల ద్వారా 1.12 లక్షల మంది రైతు రుణాలు పొందుతున్నారు. ఆయా సంఘాలు ఏటా రూ.11 కోట్లకు పైగా ఆదాయం సంపాదిస్తున్నాయి. ప్రతి ఏడాది ఆదాయం పెరగడంతో రైతులకు కావాల్సిన అన్ని రుణాలు ఒనగూరుతున్నాయి. సామర్లకోట మండలం నవర సహకార సంఘంలో 1,561 మంది సభ్యులు ఉన్నారు. రైతులకు అన్ని రకాల రుణాలు అందిస్తున్నారు. ఇక్కడ ఏటా రూ. 26 కోట్ల వరకూ రుణాలు అందిస్తుండడం విశేషం. ఈ సంఘానికి రూ.56 లక్షల ఆదాయం వస్తుంది. ధాన్యం కొనుగోలు కమీషన్, రైతులు తీసుకున్న రుణాలపై వడ్డీ ద్వారా ఈ సంఘం లాభాలు ఆర్జిస్తుంది. దీంతో ఏ రుణం కావాలన్నా రైతులకు అందించేందుకు వీలుంటుంది.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో దింపు కార్మికుడి మృతి


వీరరాఘవులు (ఫైల్)

అంబాజీపేట: కొబ్బరి చెట్టు ఎక్కే సమయంలో విద్యుత్ షాక్‌కు దింపు కార్మికుడు మృతి చెందాడు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిరతపూడి శివారు లంకవారిపేటకు చెందిన కొబ్బరి దింపు కార్మికుడు దువ్వ వీరరాఘవులు (35) ఇంటికి కూత వేటు దూరంలో ఉన్న ఓ కొబ్బరితోటలో దింపు తీసేందుకు కొబ్బరి చెట్టు ఎక్కుతున్న సమయంలో పక్కనే ఉన్న విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరరాఘవులు విద్యుత్‌షాక్‌కు గురైనట్లు అంబాజీపేట పోలీసులకు సమాచారం అందించారు.

ఉపాధి కూలీ మృతి

రావులపాలెం: మండలంలోని ఈతకోట గ్రామంలో సోమవారం ఉపాధి హామీ పనికి వెళ్లిన కూలీ గుండెపోటుతో మృతి చెందాడు. ఏపీఓ కవిత తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గండ్రోతు చక్రధర్‌రావు (69) ఉదయం ఉపాధి హామీ పనికి వచ్చాడు. పని అనంతరం నీరసంగా ఉందంటూ పక్కన కూర్చుని కుప్పకూలిపోయాడు. దీంతో గుండెపోటుతో మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారని కవిత తెలిపారు.

పండగ వెలుగు పంచి.. ఆరిపోయిన దీపాలు

- ఆ పెయింటర్ల కుటుంబాల్లో అమావాస్య చీకట్లు
- ఇటుకుల లోడు ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్
- ముగ్గురు యువకులను బలిగొన్న రోడ్డు ప్రమాదం
- మరొక వ్యక్తికి తీవ్ర గాయాలు
- ఆయా కుటుంబాల్లో తీరని విషాదం




మృతులు ఓలేటి శ్రీను, వైదాడి రాజు, పాలెపు ప్రసాద్ (ఫైల్)


ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రచ్చా శ్రీను


జాతీయ రహదారి 216 యానాం బైపాస్ లచ్చిపాలెం వద్ద ప్రమాద స్థలంలో పడి ఉన్న యువకుల మృతదేహాలు

తాళ్లరేవు: వారంతా రెక్కాడితేగాని డొక్కాడని నిరుపేద కుటుంబాలకు చెందిన యువకులు. పెయింటింగ్ వర్క్ చేస్తూ వారి కుటుంబాలకు చేదోడు వాదోడుగా ఉంటున్నారు. రాష్ట్రంలో ఎక్కడ పని ఉంటే అక్కడకు వెళ్లి పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటూ ఉంటారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో పని చేస్తూ దీపావళి పండగ జరుపుకునేందుకు శనివారం వారి స్వగ్రామాలకు వచ్చారు. పండగను తమ వాళ్లతో ఉత్సాహంగా జరుపుకున్నారు. అంతలోనే వారి కుటుంబాలను విధి వెక్కిరించింది. సోమవారం తమ బంధువుల ఇంటి వద్ద కొద్దిపాటి పని ఉండడంతో నలుగురూ ఒకే బైక్‌పై అమలాపురం వైపు వెళ్లారు. పని ముగించుకుని తిరిగి వస్తుండగా జాతీయ రహదారి 216 యానాం బైపాస్ రహదారిలోని లచ్చిపాలెం వద్ద ఆగి ఉన్న ఇటుకల లోడు ట్రాక్టర్‌ను బలంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో తాళ్లరేవు రచ్చవారిపేటకు చెందిన ఓలేటి శ్రీను(26), వైదాడి రాజు(24), పాలెపు ప్రసాద్(24) అక్కడికక్కడే మృతి చెందారు. పాలెపు ప్రసాద్ కుటుంబం రచ్చవారి పేటకు చెందినదైనప్పటికీ ఇటీవలే ఐ.పోలవరం మండలం రామాయంపేట జగనన్న కాలనీకి వెళ్లారు. కాగా మరొక యువకుడు రచ్చ శ్రీను తీవ్ర గాయాలపాలయ్యాడు. విషయం తెలుసుకున్న కోరంగి ఎస్సై రవికుమార్ హుటాహుటాన అక్కడకు చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. క్షతగాత్రుడు శ్రీనును తాళ్లరేవు బైపాస్ రహదారిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఒకే గ్రామానికి చెందిన యువకులు మృత్యువాత పడడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున ఘటనా స్థలానికి చేరుకున్నారు. కుటుంబ సభ్యుల హాహాకారాలతో ఆ ప్రాంతం హృదయ విదారకంగా మారింది. చేతికందివచ్చిన యువకులు అర్ధాంతరంగా మృత్యువాత పడడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. విషయం తెలుసుకున్న ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ప్రమాదానికి గల కారణాలను ఎస్సై రవికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. రచ్చా శ్రీనుకు మెరుగైన వైద్యం అందేవిధంగా చర్యలు చేపట్టారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.


బోరున విలపిస్తున్న మృతుడు పాలెపు ప్రసాద్ తల్లి

రచ్చవారి పేటలో విషాద ఛాయలు

మృతులంతా తాళ్లరేవు మండలం రచ్చవారిపేట గ్రామానికి చెందినవారు కావడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడు ఓలేటి శ్రీను తండ్రి గతంలోనే మృతిచెందాడు. తల్లి, అతని భార్య, కుమార్తెకు అతనే ఆధారం. శ్రీను మృతితో కుటుంబానికి జీవనాధారం లేకుండా పోయిందని బోరున విలపిస్తున్నారు. వైదాడి ప్రసాద్ తండ్రి కూడా మృతి చెందడంతో కుటుంబాన్ని అతనే పోషిస్తున్నాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రచ్చా శ్రీనుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఒకే గ్రామానికి చెందిన యువకులు మృత్యువాత పడడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు గుండెలవిసేలా విలపిస్తున్నారు.

వివాదాల అగ్నికి దంపతులు ఆహుతి


పెదపూడి మంగాదేవి (ఫైల్)


పెదపూడి ఆదినారాయణ (ఫైల్)

కొత్తపేట: వివాదాల అగ్నికి భార్యభర్తలు బలయ్యారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా..డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం అవిడిలో కట్వలాంబిక కాలనీకి చెందిన పెదపూడి ఆదినారాయణ (42) పాత ఇనుము, ముగ్గు వ్యాపారం చేస్తుంటాడు. ఇతని భార్య పేరు మంగాదేవి (35). వీరికి దుర్గాప్రసాద్, నాగరాజు అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆదినారాయణ మద్యం తాగి తరచూ భార్యతో గొడవ పడుతుంటాడు. ఆ క్రమంలో ఆదివారం రాత్రి రూ.2 వేలు కావాలని భార్యను అడిగాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఆదినారాయణ ఇంట్లో ఉన్న పెట్రోలు ఒంటిపై పోసుకున్నాడు. అగ్గిపెట్టె తీసుకుని వెలిగించుకున్నాడు. వెంటనే భార్య, కుమారులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అప్పటికే మంటలు ఆదినారాయణ శరీరాన్ని చుట్టుముట్టాయి. కుటుంబ సభ్యులు కేకలు, ఆర్తనాదాలు విని స్థానికులు చేరుకుని మంటలు ఆర్పారు. మంటలు అంటుకున్న మంగాదేవి సజీవ దహనమైంది. ఆదినారాయణ, కుమారుడు దుర్గాప్రసాద్ తీవ్రంగా గాయపడ్డారు. మరో కుమారుడు నాగరాజు స్వల్పంగా గాయపడ్డాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో వీరిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆదినారాయణ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని జిల్లా అడిషనల్ ఎస్పీ ఎస్‌కే ఖాదర్‌బాషా, ఇన్‌చార్జి డీఎస్పీ సుంకర మురళీమోహన్, రావులపాలెం సీఐ రజనీకుమార్, స్థానిక ఎస్‌ఐ వి.మణికుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఊరెళ్లారు... ఇంటిని ఊడ్చేశారు

- అమలాపురంలో తాళాలు వేసిన ఇంట్లో చోరీ
- రూ.17 లక్షల విలువైన సొత్తు అపహరణ


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీ అంబికా ప్రసాద్


దొంగలు తెరిచిన ఇనుప బీరువా

అమలాపురం టౌన్: దీపావళి పండగ సందర్భంగా సెలవులు కలిసి రావడంతో ఉద్యోగులైన ఆ దంపతులు తమ ఇంటికి తాళం వేసి ఊరెళ్లారు. ఇదే అవకాశంగా మలుచుకున్న దొంగలు వారు ఊరు వెళ్లి వచ్చేలోపు తలుపులు పగులగొట్టి ఇంట్లో బంగారం, నగదును దోచుకున్నారు. అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలో జరిగిన ఈ చోరీలో దొంగలు మొత్తం రూ.17 లక్షల విలువైన బంగారు నగలు, వెండి వస్తువులు, నగదు దోచుకున్నారు. విశాఖలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి కుడాలి సుజయ్‌కుమార్, ముమ్మిడివరంలో ఓ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న లక్ష్మీ తులసీ దంపతులు అమలాపురం హౌసింగ్ బోర్డులోని ఓ ఇంట్లో నివాసం ఉంటున్నారు. శనివారం సాయంత్రం ఇంటికి తాళం వేసి పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటి పనిమనిషి వచ్చే సరికి తలుపులు పగులగొట్టి ఉండడంతో ఆ సమాచారాన్ని ఆ దంపతులకు చేరవేసింది. హుటాహుటీన వచ్చిన భార్యాభర్తలు తమ ఇంట్లో సొత్తును దొంగలు దోచుకున్నారని గుర్తించారు. దొంగలు ప్రధాన ద్వారం తాళం పగొలగొట్టి లోనికి ప్రవేశించారు. బెడ్‌రూమ్‌లోని ఇనుప బీరువా తాళాలు కాడా పగులగొట్టి ఈ చోరీకి పాల్పడ్డారు. 272 గ్రాముల బంగారు నగలు, వెండి మొలతాడు, రూ.1.30 లక్షల నగదును దోచుకున్నట్లు భార్యాభర్తలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సొత్తు విలువ రూ.17 లక్షలు ఉంటుందని అంచనా కట్టారు. చోరీ జరిగిన ఇంటిని ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా, అమలాపురం డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ పరిశీలించారు. క్లూస్ టీమ్ ఆధారాలను సేకరించింది.

లాక్డ్ హౌస్ మోనటరింగ్‌ను వినియోగించుకోవాలి

ఎవరైనా ఇంటికి తాళాలు వేసి ఏదైనా ఊరు లేదా క్యాంపునకు వెళుతున్నప్పుడు పోలీసుశాఖ ద్వారా అందుబాటులో ఉన్న లాక్డ్ హౌస్ మోనటరింగ్ సాంకేతిక విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎస్పీ అంబికా ప్రసాద్ సూచించారు. ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లే వారు ఈ విధానం కోసం దగ్గరలో ఉన్న పోలీసుస్టేషన్‌ను సంప్రదిస్తే ఆ సాకర్యాన్ని పోలీసులే ఏర్పాటు చేస్తారని తెలిపారు.

కాలువలో పడి వ్యక్తి మృతి


బాలరాజు మృతదేహం

అనపర్తి: ద్విచక్ర వాహనం అదుపుతప్పి పంట బోదె కాలువలోకి దూసుకుపోవడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కొప్పవరం గ్రామ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై జగన్మోహన్‌రావు తెలిపిన వివరాల ఈ విధంగా ఉన్నాయి. కోనసీమ జిల్లా రాయవరం మండలానికి చెందిన మిరియాల బాలరాజు(28) పెయింటింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం దీపావళి కావడంతో బాలరాజు తన భార్య శ్యామల, ఇద్దరు సంతానంతో కలిసి ఆదివారం ఉదయం అనపర్తిలోని అత్తవారింటికి వచ్చాడు. దీపావళి సంబరాలు అనంతరం ఆదివారం రాత్రి బాలరాజు ఒక్కడే ద్విచక్ర వాహనంపై రాయవరం బయలుదేరాడు. అయితే కొప్పవరం గ్రామ సమీపానికి చేరుకునే సరికి పొగమంచు కారణంగా రోడ్డు సక్రమంగా కనబడక ప్రమాదవశాత్తు కాలువలోకి పడిపోవడంతో తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య శ్యామల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

చెడు అలవాట్లకు బానిసై చోరీల బాట

- అంతర జిల్లా నేరస్తుడి అరెస్టు
- 18 కేసులలో నిందితుడు
- రూ.23.80 లక్షలు విలువైన బంగారం, వెండి వస్తువులు, స్కూటీ స్వాధీనం


నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులను పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): చెడు అలవాట్లకు బానిసై చోరీల బాటపట్టిన అంతర జిల్లా నేరస్తుడిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 18 కేసులలో చోరీ చేసిన రూ.23.80 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులు, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. రాజమహేంద్రవరం దిశ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ పి.జగదీష్ అరెస్టుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణం ఇరగవరం కాలనీకి చెందిన యడ్ల నవీన్‌ప్రసాద్(రెడ్డి) చెడు వ్యసనాలకు బానిస కావడంతో సొమ్ము కోసం తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకున్నాడు. ఉదయం సమయంలో తన మోటార్ వాహనంపై తాళం వేసిన ఇళ్లను చూసుకుని పగలు, రాత్రి అని తేడా లేకుండా ఇంటి తాళాలు పగలుగొట్టి బీరువాలోని బంగారం, వెండి వస్తువులను చోరీ చేయడం మొదలు పెట్టాడు. తూర్పుగోదావరి జిల్లాలోని ఉండ్రాజవరం పోలీస్‌స్టేషన్‌లో ఆరు కేసులు, కొవ్వూరు టౌన్‌లో ఒక కేసు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు కేసులు, అమలాపురం టౌన్‌పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు కేసులు, పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మూడు కేసులు, తణుకు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు కేసులు నమోదయ్యాయి. దీంతో జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాలతో కొవ్వూరు సబ్‌డివిజన్ డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ పర్యవేక్షణలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటేశ్వరరావు సూచనల మేరకు ఉండ్రాజవరం పోలీస్‌స్టేషన్ ఎస్సై కె.రామారావు, సీసీఎస్ ఎస్సై రవీంద్ర, హెడ్ కానిస్టేబుళ్లు వై.నాగేశ్వరరావు, వి.బొజ్జి, పీసీలు ముత్యాలరావు, రమేష్, సత్యనారాయణ, అప్పారీబేగ్‌లతో ఎస్సై రామారావుకు వచ్చిన సమాచారం మేరకు ఉండ్రాజవరం మండలం పాలంగి గ్రామంలో యడ్ల నవీన్‌ప్రసాద్‌ను చాకచక్యంగా అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 458 గ్రాముల బంగారు ఆభరణాలు, 590 గ్రాముల వెండి వస్తువులు, రూ.30 వేలు, వెస్పా స్కూటీని స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటి విలువ రూ.23.80 లక్షలు ఉంటుందన్నారు. 18 కేసులలో నిందితుడైన యడ్లనవీన్ ప్రసాద్‌ను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ఎస్పీ జగదీష్ అభినందించి, వారికి రివార్డులను మంజూరు చేసి అందించారు.

మోటార్ సైకిల్‌పైకి దూసుకెళ్లిన లారీ

ఒకరు మృతి.. మరో ఇద్దరికి గాయాలు


సురేష్ (ఫైల్)


ప్రమాద స్థలంలో లారీ

గండేపల్లి: తెల్లారితే పండగ...బాణసంచా వెలుగులతో సంతోషంగా గడపాల్సిన ఆ రెండు కుటుంబాలలో చీకటి నెలకొంది. మృత్యువు లారీ రూపంలో దూసుకువచ్చింది. జగ్గంపేటకు చెందిన మాదవరపు శ్రీనివాస్ (పెద్ద), వరలక్ష్మిల కుమార్తె సత్యరమాదేవికి తంటికొండకు చెందిన జుట్టా సురేష్ (30)తో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల రష్మిక ఉంది. సురేష్ ఇటీవల కాలంలో ఒక ప్రైవేట్ మైనింగ్ చెక్ పోస్టులో పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా శనివారం రాత్రి తోటి సిబ్బంది గోకవరానికి చెందిన పెనుగొండ శ్రీను, కొడవలికి చెందిన పోలిక శేఖర్‌తో కలిసి మోటార్ సైకిళ్లపై మండలంలోని మురారి వెళ్లారు. తిరిగి తాళ్లూరు వస్తుండగా మల్లేపల్లి శివారు హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్దకు వచ్చేసరికి విశాఖ వైపు వెళుతున్న లారీ సురేష్ ప్రయాణిస్తున్న మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో తన ముందు ప్రయాణిస్తున్న శ్రీను, శేఖర్‌ల మోటార్ సైకిల్‌ను సురేష్ ఢీకొట్టి రోడ్డుపై పడిపోయాడు. లారీ సురేష్ శరీరంపై నుంచి దూసుకుపోవడంతో శరీరం నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందాడు. రోడ్డు పక్కనే పడిపోయిన శ్రీను, శేఖర్‌కు గాయాలయ్యాయి. ప్రమాద స్థలం వద్దకు చేరుకున్న రోడ్డు సేఫ్టీ సిబ్బంది క్షతగాత్రులను జగ్గంపేట ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్సకి తరలించారు. పెద్దాపురం ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం సురేష్ మృతదేహాన్ని గండేపల్లి పోలీసులు బంధువులకు అప్పగించారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పిఠాపురం: స్థానిక దివిలి రోడ్డులో మోటారు సైకిల్‌పై వెళుతున్న ఇద్దరు వ్యక్తులను లారీ ఢీకొట్టడంతో ఒక వ్యక్తి మృతి చెందగా మరొకరికి గాయాలయినట్లు పిఠాపురం రూరల్ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం దివిలి నుంచి పిఠాపురం వెళుతున్న టిప్పర్ లారీ పిఠాపురం మండలం కుమారపురం వద్ద మోటారు సైకిల్‌పై వెళుతున్న తుమ్మలపల్లి సుబ్రహ్మణ్యం (29), నామా శివలను ఢీకొట్టింది. దీంతో మోటారు సైకిల్‌పై ఉన్న సుబ్రహ్మణ్యం మృతి చెందగా శివకు గాయాలవ్వడంతో అతనిని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. పిఠాపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అల్లవరంలో సినిమా సందడి



అల్లవరంలోని థియేటర్ వద్ద జరుగుతున్న షూటింగ్

అల్లవరం: గీతా ఆర్ట్స్–2 బేనర్‌పై యువ హీరో నార్నే నితిన్, హీరోయిన్ నయనసారికలు నటిస్తున్న చిత్రంలో పోరాట సన్నివేశాలను అల్లవరం వెంకటరామ భద్ర థియేటర్‌లో సోమవారం చిత్రీకరించారు. అమలాపురం మండలం కొంకాపల్లి ప్రాంతానికి చెందిన కంచిపల్లి అంజి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. రామ్ మిర్యాల సంగీతం అందిస్తున్నారు. అల్లవరంలో జరుగుతున్న సినిమా షూటింగ్ చూడటానికి స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

జాతీయ రహదారిపై 'నకిలీ'ల దందా

ఇద్దరి అరెస్టు


సీఐ కాశీవిశ్వనాథ్

రాజానగరం: జాతీయ రహదారిపై పీడీఎస్ బియ్యాన్ని అనధికారికంగా రవాణా చేస్తున్న వాహనాన్ని అడ్డగించి, విలేకరులమని, విజిలెన్స్ అధికారులమని చెప్పి బెదిరించి దందాకు పాల్పడుతున్న ఐదుగురు వ్యక్తుల ముఠాలో ఇద్దరు రాజానగరం పోలీసులకు చిక్కారు. స్థానిక సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపిన వివరాలిలావున్నాయి. పేదలకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని ఇంటింటికీ తిరిగి కొనుగోలు చేసి, రవాణా చేయడం సతీష్ అనే వ్యక్తి అలవాటుపడ్డాడు. ఈ క్రమంలో ఈ నెల 10వ తేదీ రాత్రి పిఠాపురం మండలం, విరవకు చెందిన సంగుల వరప్రసాద్, భూజేంద్రస్వామిల ద్వారా వ్యాన్‌లో న్యూజివీడు నుంచి కాకినాడ పోర్టుకు పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నారు. ఆ విషయాన్ని ముందుగానే తెలుసుకున్న ఈ ముఠా సభ్యులు గొల్లపల్లి చక్రధర్ (రాగంపేట), నాగిరెడ్డి వెంకటరమణమూర్తి (జగ్గంపేట మండలం, రాజపూడి), ఇమ్మల సత్తిబాబు (సామర్లకోట), జాగు దుర్గారావు (గొల్లప్రోలు), సంగన బుజ్జి (కాండ్రకోట సమీపంలోని మర్లావ) రాజానగరం – కలవచర్ల జంక్షన్‌లో ఆ వ్యాన్‌ను ఆపారు. కారులో వచ్చిన వారిలో ఇద్దరు బయటకు దిగి తాము విలేకరులమని, లోపల విజిలెన్స్ అధికారులున్నారంటూ ఓనర్ కమ్ డ్రైవర్ అయిన సంగుల వరప్రసాద్ నుంచి రూ.లక్ష డిమాండ్ చేశారు. కేసు నమోదైతే వ్యాన్ కూడా మిగలదని బెదిరించారు. చివరకు రూ.20 వేలకు బేరం కుదుర్చుకుని, సొమ్ము తీసుకున్నారు. అదే సమయంలో గస్తీ తిరుగుతున్న ఎస్సై సుధాకర్ అనుమానంతో వారి వద్ద ఆగడంతో కారులో ఉన్న ముగ్గురితోపాటు బయట ఉన్న ఇద్దరు కూడా పరారయ్యారు. ఆ పై వ్యాన్ డ్రైవర్ వరప్రసాద్ నుంచి కూపీ లాగగా ఇదే విధంగా ఈ ముఠా సభ్యులు రాజమహేంద్రవరం – కాకినాడ మధ్యలో పలుమార్లు సొమ్ము వసూలు చేసినట్టు తెలుసుకున్నారు. అనంతరం వ్యాన్ డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశారు. పరారైన నిందితులలో నాగిరెడ్డి వెంకటరమణమూర్తి, ఇమ్మల సత్తిబాబును అరెస్టు చేశామని సీఐ తెలిపారు. వీరిని రిమాండ్‌కి తరలిస్తున్నామన్నారు.

సబ్ జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపికలు రేపు

తాళ్లరేవు: జిల్లా సబ్ జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపిక పోటీలు బుధవారం చొల్లంగి జెడ్పీ హైస్కూల్ నిర్వహించనున్నట్లు సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌వీ సాయిబాబు, వి.అఖిల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలలో ఎంపికైన జట్లు నవంబర్ 25, 26 తేదీలలో కాకినాడలో జరుగనున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ చాంపియన్ షిప్, రాష్ట్ర జట్ల ఎంపికలో పాల్గొంటాయన్నారు. ఈ పోటీలకు 2008వ సంవత్సరం తరువాత జన్మించిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 15వ తేదీ ఉదయం 10 గంటలకు ధ్రువీకరణ పత్రాలతో చొల్లంగి పీడీ, పోటీల కార్య నిర్వాహక కార్యదర్శి నీలిమను సంప్రదించాలని కోరారు.

కేశనపల్లి బీచ్‌లో మృతదేహం

మలికిపురం: మండలంలోని కేశనపల్లి బీచ్‌లో సముద్రం నుంచి కొట్టుకు వచ్చిన మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్సై బి.సంపత్‌కుమార్ సోమవారం తెలిపారు. అమలాపురం మండల కామనగరువుకు చెందిన మేడా శ్రీ సాయి వెంకట సుబ్బారావు(28)గా గుర్తించినట్లు ఆయన వివరించారు. కొన్ని రోజుల క్రితం మామిడికుదురు మండలం పాశర్లపూడి వంతెన నుంచి గోదావరిలో ఈ వ్యక్తి దూకినట్లు ఆయన తెలిపారు. పోస్టుమార్టం కోసం రాజోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన వివరించారు.